
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 26 ఆగస్టు 2024





కనువిందు

చుట్టూ పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలు.. పచ్చిక బయళ్ల మధ్య చెరువు.. అంతే కాదు.. దానిపై నీలి రంగులో ఉన్న ఆకాశంలో మెరిసిపోతున్న వెండి మబ్బులు.. కనుచూపు మేర కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు. బషీరాబాద్ మండలం మైల్వార్ ఎల్లమ్మ చెరువు వద్ద ఆవిష్కృతమైంది ఈ సుందర మనోహర దృశ్యం. ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది.

- బషీరాబాద్

శివయ్యకు లక్ష బిల్వార్చన

శ్రావణమాసం సందర్భంగా వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలోని శివాలయంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుడ్ల శివరాజ్, ప్రమతమాణిక్యాలు మాట్లాడుతూ, శ్రావణమాసంలో ఉపవాస దీక్షలు దైవభక్తిని చాటాలన్నారు. శివుడికి లింగార్చన చేయడం ద్వారా శుభం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పటేల్ జగదీశ్వర్, పంతులు ప్రవీణ్‌కుమార్, రవికుమార్, విద్యాసాగర్, భూమల్లేశం, ప్రకాశ్, విజయ్‌కుమార్, శివలింగం,వీరన్నలు పాల్గొన్నారు.

- పరిగి, ఆగస్టు 25



పట్టాలు దాటుతుండగా కదిలిన గూడ్స్

- త్రుటిలో మహిళకు తప్పిన ప్రాణాపాయం
- నవాంద్గీ రైల్వేస్టేషన్‌లో ఘటన



ట్రాక్ మధ్యలో పడుకున్న మహిళ

బషీరాబాద్, ఆగస్టు 25 : రైల్వేస్టేషన్‌లో ఆగిఉన్న గూడ్స్ రైలు కింద నుంచి గుర్తుతెలియని మహిళ ట్రాక్ (పట్టాలు) దాటుతుండగా ఒక్కసారిగా రైలు కదిలింది. అప్పటికే ఆ మహిళ రైలు కింద మధ్యలో ఉండటంతో అప్రమత్తమై పట్టాల మధ్యన నెలకొరిగి పడుకోవడంతో ప్రాణాలతో క్షేమంగా బయట పడింది. ఈ ఘటన బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వే స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గుర్తు తెలియని మహిళ నవాంద్గీ రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలు చివరలో కింద నుంచి ఆటు వైపుగా దాటి వెళ్లే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో రైలు అకస్మాత్తుగా ముందుకు కదిలింది. వెంటనే అప్రమత్తమైన ఆ మహిళ రైలు కింద పట్టాల మధ్యన తల వంచి పడుకోవడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడింది. ఆ సమయంలో అక్కడున్న స్థానిక యువకుడు రైలుకిందకు వెళ్లిన మహిళతో మధ్యలో కింద పడుకోమని ధైర్యం చెబుతూ వీడియో తీయడంతో విషయం వెలుగుచూసింది. రైలు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఆ మహిళ పైకిలేచి మెల్లగా రావడంతో అక్కడున్న యువకుడు, మరికొందరు ఊపిరి పీల్చుకున్నారు. రైలు ప్రమాదం నుంచి ప్రాణాలతో క్షేమంగా బయటపడిన ఆ మహిళ భయందోళనతో పరుగుపరుగున అక్కడి నుంచి వెళ్లిపోయింది. కాగా, ఆ సమయంలో ఇదే రైలు కింద నుంచి మరో మహిళ కూడా ట్రాక్ దాటి అటువైపు నిలబడి ఇదంతా చూస్తూ బిక్కుబిక్కుమంటూ అక్కడి నుంచి జారుకుందని ప్రత్యక్ష సాక్షులు చెప్పుకొచ్చారు.

ప్రజల కోసం పనిచేస్తాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి


రోడ్లపై గుంతలను పూడ్చుతున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఆగస్టు 25: అధికారంలో ఉన్నా లేకున్న ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని 31, 32 వార్డులలో బీజేపీ జిల్లా నాయకులు బుస్సా శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీజేపీ మునిసిపల్ దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్లను సిమెంట్‌తో చదును చేసి కాంక్రిట్‌తో పూడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పట్టణంలోని ఆయా వార్డులలో నెలకొన్న సమస్యలను మునిసిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని, గుంతలు పడ్డ రోడ్లను పూడ్చాలని కోరారు. లేని పక్షంలో మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, పోకల సతీష్, నందు, రాములు, శ్రీధర్, నరోత్తంరెడ్డి, పాండు, అమర్నాథ్ , మోహన్ రెడ్డి, మాణిక్య ప్రభు , కన్నయ్య పాల్గొన్నారు.

సరిహద్దు సమస్యపై నజర్!

వివాదం పరిష్కరించేందుకు సీఎం రంగంలోకి..

తెలంగాణ - కర్ణాటక సరిహద్దులో నెలకొన్న అటవీ భూ(పోడు) వివాదం పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. చాలా సంవత్సరాలుగా నెలకొన్న ఈ భూ వివాదాన్ని శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో భూ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ త్వరలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు లేఖ రాయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.




తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో భూవివాద స్థలం ఇదే

- కర్ణాటక సీఎంకు లేఖ రాయాలని నిర్ణయం
- సీఎం రేవంత్ దృష్టికి భూ సమస్యను తీసుకెళ్లిన మంత్రి పొంగులేటి
- ఫలించనున్న ఎమ్మెల్యే కృషి

తాండూరు/బషీరాబాద్, ఆగస్టు 25: వికారాబాద్ జిల్లాలో తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌ను అనుకుని ఉన్న తాండూరు నియోజకవర్గంలోని సరిహద్దు గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యకు శాశ్వత పరిష్కరం చూపేలా సీఎం దృష్టి సారించారు. ఇందుకు సంబంధించి చర్యలు తీసుకునేందుకు అధికారులకు ఆదేశాలు అందినట్లు సమాచారం. తెలంగాణ - కర్ణాటక సరిహద్దులో బషీరాబాద్ మండల రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యను ఈనెల 5న బషీరాబాద్ మండలంలో పర్యటించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తీసుకువచ్చారు. ఇదే ప్రాంతంలోని కర్ణాటక సరిహద్దులో ఉండే బంట్వారం మండలం సరిహద్దులో ఉన్న రైతులు కూడా ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నారు. ఈవిషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల సరిహద్దులో తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న భూ వివాద సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువెళ్లారు. చాలా రోజులుగా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సీఎం భావిస్తున్నట్లు తెలిసింది. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న బషీరాబాద్, బంట్వారం మండలాల రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యను కర్ణాటక సీఎం సిద్ధరామయ్య దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కార మార్గం కనుక్కోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. చాలా కాలంగా కొనసాగుతూ వచ్చిన ఈ భూసమస్యను పరిష్కరించేందుకు క్షేత్ర స్థాయిలో ఇరు రాష్ట్రాల అధికారులు పర్యటించి చర్చల ద్వారా అవసరమైన పరిష్కార చర్యలు తీసుకునే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలిసింది.

బషీరాబాద్, బంట్వారం మండలాల సరిహద్దుల్లో..

కర్ణాటక రాష్ట్రం కలబురిగి జిల్లా, సేడం తాలుకాకు చెందిన రైతులు తెలంగాణ రాష్ట్రంలోని బషీరాబాద్ మండలం, మైల్వార్, నీళ్లపల్లి, జలాల్‌పూర్ అటవీ భూభాగంలోకి వచ్చినట్లు రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు చెబుతున్నారు. మరోవైపు అటవీ, రెవెన్యూ భూములు ఏవనేవి కూడా స్పష్టంగా తేలడం లేదు. ఇరు రాష్ట్రాలకు చెందిన రైతులు ఈ భూములు తమవి అంటే, తమవేనంటూ వివాదానికి దిగుతున్నారు. ఈ విషయంలో కర్ణాటక రాష్ట్ర అధికారులు స్పష్టత ఇవ్వని కారణంగా పలుమార్లు ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. గతంలో తాండూరు నియోజకవర్గం పరిధిలో ఉండి ప్రస్తుతం వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే బంట్వారం మండలానికి చెందిన పలు గ్రామాలు కర్ణాటక సరిహద్దు కుంచారం సమీపంలో ఉన్నాయి. ఇక్కడి పొలాలు సమస్య కూడా వివాదంగా మారింది. కర్ణాటక రాష్ట్ర రైతులు తెలంగాణ భూభాగంలోకి చొచ్చుకు వచ్చి ఇది తమ భూమి అంటూ వాదనలకు దిగుతున్నారు. ఒక్కోసారి రైతుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీస్తోంది.

ఇరు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో



తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం, మైల్వార్, ఇస్మాయిల్ పూర్, నీళ్లపల్లి గ్రామాలకు సంబంధించి కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న పోడు భూముల సమస్య పరిష్కరించాలి. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లాం. చాలా కాలంగా సాగుతూ వస్తున్న ఈ భూ సమస్య పరిష్కారానికి మంత్రులు త్వరితగతిన తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతే కాకుండా వారు సంబంధిత అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశారు. ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో భూ వివాదం పరిష్కారమయ్యేందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుంటుంది.

- మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

‘టెండర్’కు వెనుకడుగు!



తాండూరు మున్సిపాలిటీలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ల ఆనాసక్తి

సకాలంలో బిల్లులు చెల్లించక పోవడమే కారణమా!

- 140 పనులకు టెండర్లు .. 70 పనులకే ఆమోదం
- అగ్రిమెంట్ చేసుకునేవి ఏన్నో..
- పనులు ప్రారంభమయ్యే వరకు డౌటే

తాండూరు, ఆగస్టు 25: తాండూరు మున్సిపాలిటీలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు. మున్సిపాలిటీ పనాప్పా... వద్దప్పా! అంటున్నారు. ఇందుకు కారణం లేక పోలేదు. పనులు పూర్తి చేసి బిల్లులు సకాలంలో చెల్లింపులు కాక కాంట్రాక్టర్లు సంవత్సరాల పాటు మున్సిపాలిటీ చుట్టూ తిరిగారు. గత నెలలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ తీర్మాణం మేరకు టెండర్లు వేయగా 50శాతం మేర పనులకు టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపలేదు. టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు కూడా సార్! మున్సిపాలిటీలో డబ్బులున్నాయా ఉంటే ఏ ఫండ్స్‌లో డబ్బులున్నాయి..మేము పని చేస్తే తొందరగా బిల్లులు వస్తాయా..అంటూ అగ్రిమెంట్ చేసుకునే ముందు అధికారులను అడుగుతున్నారు. నిధులు ఉన్నాయని ఇంజనీర్ శాఖ అధికారులు భరోసా ఇచ్చినప్పుడే అగ్రిమెంట్ చేసుకుని పనులు మొదలు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. తాండూరు మున్సిపాలిటీలో పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు జంకుతున్నారు. పనులు పూర్తి చేసినా దాదాపు యేడాది కాలంగా ట్రెజరీలో చెక్కులు పాస్ కాక అటు ట్రెజరీ చుట్టూ, ఇటు అధికారుల చుట్టూ ఇంకా పలువురు కాంట్రాక్టర్లు తిరుగుతూనే ఉన్నారు.

మూడు నెలలే!

ఈ పాలక మండలి గడవు 2025 జనవరి 26తో ముగుస్తుంది. ఈ ఏడాది డిసెంబర్‌లో నెలలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. అయితే ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ఇంకా మూడు నెలల గడువే ఉంది. దీంతో ఆ పనులకు రీ టెండర్ వేయాలంటే తక్కువ సమయం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా మిగిలిన పనులకు రీటెండర్ వేసినా ఆ పనులు అక్టోబర్ నెలలో ప్రారంభించే అవకాశాలున్నాయి. అయితే అగ్రిమెంట్ అయిన పనులు ఎన్ని జరుగుతున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు 50 పనుల వరకు అగ్రిమెంట్ జరిగాయి. ఇందులో 15 నుంచి 20 వరకు పనులు ప్రారంభమయ్యాయి. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. మొదట చేసిన పనులకు నిధులు చెల్లించక పోయినా మిగిలిన పనులు చేయాలన్న ఆలోచనలో కాంట్రాక్టర్లు ఉన్నారు.

పనులు, టెండర్ల వివరాలు

పని పేరు	ఆన్‌లైన్ టెండర్ల సంఖ్య	కాంట్రాక్టర్లు వేసిన టెండర్లు	అంచనా విలువ (రూ. కోట్లలో)	టెండర్లకు రాని పనుల సంఖ్య
ఓపెన్‌ప్లాట్లు, పార్కుల అభివృద్ధి	30	18	3.87	12
సివిల్ వర్క్	28	టెండర్ రాలేదు	0.71	28
సివిల్ వర్క్	82	52	3.83	30
మొత్తం	140	70	8.41	70

మున్సిపాలిటీగా డబిల్‌పూర్?

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఎనిమిది గ్రామాలు కలిపి బల్దియా ఏర్పాటుకు ప్రణాళికలు



మేడ్చల్ టౌన్, ఆగస్టు 25 :నగరశివారు ప్రాంతంలోని గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా మేడ్చల్ మండలంలోని డబీల్‌పూర్ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం మండలంలోని డబిల్‌పూర్, మైసిరెడ్డిపల్లి, లింగాపూర్, బర్మాజీగూడ, నూతన్‌కల్, శ్రీరంగవరం, ఎల్లంపేట బండమాదారం గ్రామాలను కలుపుతూ కొత్తగా డబిల్‌పూర్ మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇటీవల అధికారులు ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో కొత్త మున్సిపాలిటీ ప్రతిపాదన కోసం స్థానికులకు సంకేతాలిచ్చారు. డబిల్‌పూర్‌ను మున్సిపాలిటీగా మార్చడంతో విలీనం చేస్తున్న గ్రామాలను కలుపుకుని 25నుంచి 30 వేల జనాభా ఉండనుంది. ఓటర్ల పరంగా 18 నుంచి 20వేల మంది ఉండనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మేడ్చల్ మండలం పరిధిలో మొత్తం 17గ్రామ పంచాయతీలున్నాయి. అందులో 8గ్రామాలను కలుపుకుని డబిల్‌పూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. మరో రెండు పంచాయతీలు పూడూరు, రాయిలాపూర్ మేడ్చల్ మున్సిపాలిటీలో, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాలను విలీనం చేశారు. కాగా మండలంలో మిగిలిపోయిన రావల్‌కోల్, రాజబొల్లారం, సోమారం, రాజబొల్లారం తండా, యాడారం గ్రామాలను కలుపుతూ రావల్‌కోల్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తారా లేక పంచాయతీలుగా కొనసాగిస్తార అన్న విషయం పట్ల స్పష్టత కరువైంది. దీంతో మిగిలిన గ్రామాల ప్రజలు తర్జనభర్జన పడుతున్నారు.

కొత్త మున్సిపాలిటీలు ఏర్పడినా చివరికి గ్రేటర్‌లో విలీనం?

ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు కానున్న డబిల్‌పూర్ మున్సిపాలిటీతో పాటు కొనసాగుతున్న మేడ్చల్ మున్సిపాలిటీలను భవిష్యత్తులో గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేస్తారన్న వాదనలు బలంగా వినబడుతున్నాయి. ఈ మున్సిపాలిటీలకు భవిష్యత్తులో ఎన్నికలు మాత్రం జరగబోవని, గ్రేటర్ ఎన్నికల వరకు రెండు మున్సిపాలిటీలను విలీనం చేస్తారని అప్పటి వరకు అధికారుల పాలన కొనసాగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో అధికారులకు , అధికార పార్టీకి చెందిన బడానేతలకు స్పష్టత ఉన్నప్పటికీ కింది స్థాయి నేతలకు అవగాహన లేక అయోమయంలో ఉన్నారు.

‘అంగన్‌వాడీ’ ఏర్పాటుకు సహకరిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 25 : తమ కాలనీ కమ్యూనిటీ హాలులో అంగన్ వాడీ కేంద్రం యథావిధిగా కొనసాగేలా కాలనీ సొసైటీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఉమానగర్ కాలనీవాసులు స్పష్టం చేశారు. కాగా, ఇటీవల ‘ఆంధ్రజ్యోతి’లో అంగన్‌వాడీపై తల్లడిల్లుతున్న తల్లులు, గర్భిణులు అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై కాలనీ వాసులు స్పందించారు. ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి తమ అభి ప్రాయాన్ని వెలిబుచ్చారు. తమ కాలనీలో రేకుల షెడ్డు కమ్యూనిటీ హాలులో 12 సంవత్సరాలుగా ఎలాంటి అద్దె చెల్లించకుండా అంగన్‌వాడీ సెంటర్‌ను అనుమతించామని సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహస్వామి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డిలు తెలిపారు. ప్రస్తుతం రేకులు పూర్తిగా ధ్వంసం కావటంతో పిల్లలకు, గర్భిణులకు ఇబ్బందులు కలగరాదన్న ఉద్దేశంతో భవనాన్ని కూల్చి సొసైటీ తరఫున కొత్త భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కాగా, కాలనీలో ప్రభుత్వం తరఫున పక్కా భవనం నిర్మించి ఇవ్వదలుచుకుంటే వేరే స్థలం ఉందని, అక్కడ అంగన్‌వాడీ కేంద్రం కోసం భవనం నిర్మించి ప్రారంభించాలని కోరారు. సమావేశంలో కాలనీ పెద్దలు రంగారావు, పాండు, చంద్రశేఖర్‌రెడ్డి, మీనేందర్‌రెడ్డి, భిక్షపతి, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన ఉమానగర్ కాలనీ వాసులు



తాండూరులో 'సైక్లోథాన్'



తాండూరు, ఆగస్టు 25: జాతీయ క్రీడోత్సవాలు, క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అఖిల భారత మర్వాడీ యువమంచ్ తాండూరు శాఖ ఆధ్వర్యంలో 'సైక్లోథాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని గంగోత్రి విద్యాలయానికి చెందిన 150మంది విద్యార్థులతో మంచ్ ప్రతినిధులు కలిసి విలియమూన్ చౌరస్తా నుంచి ఇందిరాచౌక్, గంజ్, గాంధీచౌక్, మర్వాడి బజార్, పటేల్ బగీచా మీదుగా గగరాణి గార్డెన్ వరకు చేరుకుంది. ర్యాలీని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్డా మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యంపై ప్రజలకు అవగాహన పెంచడానికి ఈ ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచ్ అధ్యక్షుడు అనిల్ సార్డా, కార్యదర్శి సచిన్‌రాఠి, కోశాధికారి అరుణ్ సార్డా, సన్ని అగర్వాల్, ఆశిష్ సార్డా, అభిషేక్ అగర్వాల్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.















హెడ్‌కానిస్టేబుల్ యాదయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

హెడ్ కానిస్టేబుల్ యాదయ్యను ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే యాదయ్య

రాష్ట్రపతి గ్యాలెంటరీ మెడల్‌కు ఎంపిక..

నాయకులు, గ్రామస్తుల ఘన సన్మానం

చేవెళ్ల, ఆగస్టు 25: పోలీస్ హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. ఇటీవల రాష్ట్రపతి గ్యాలెంటరీ మెడల్‌కి ఎంపికైన హెడ్‌కానిస్టేబుల్ చదువు యాదయ్యను స్వగ్రామమైన చేవెళ్ల మండల పరిధిలోని మీర్జాగూడలో ఆదివారం మాజీ సర్పంచ్ ఉమ్మెతల భీమయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే యాదయ్య, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామిలతోపాటు మండల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదయ్య ప్రాణాలను లెక్క చెయ్యకుండా విధి నిర్వహణలో దొంగలను పట్టుకొన్న విషయాన్ని గుర్తుచేశారు. పోలీస్ శాఖలో ఇలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. తన ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి రాష్ట్రపతి పతకానికి ఎంపికవ్వడం పట్ల గర్వపడుతున్నట్లు తెలిపారు. యాదయ్య మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో పాటు గ్రామస్తులు పెద్దసంఖ్యలో యాదయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం, మాజీ జెడ్పీటీసీ మాలతీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు భీమయ్య, బండారు శైలజా ఆగిరెడ్డి, ప్రభాకర్, రమేశ్‌గౌడ్, యాదయ్య, లావణ్యాశంకర్, మధుసూదన్‌గుప్తా, జహంగీర్, మాజీ ఉప సర్పంచ్‌లు జనార్దన్, మండల సీనియర్ నాయకులు రాజేశ్‌బాబు, బండారు ఆగిరెడ్డి, శ్రీనివాస్, శ్రీశైలం, వైభవ్‌రెడ్డి, దేవుని శర్వలింగం, రవీందర్‌రెడ్డి, బాలయ్య, ఆశోక్, శంకరయ్య, అంజయ్య, సత్యయ్య, సురేందర్, నరేందర్, రవి, మల్లేశ్, పెంటయ్య, రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు జవ్వాజీ లింగం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25: క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎదులాబాద్ ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు జవ్వాజీ లింగంముదిరాజ్ తెలిపారు. మండలంలోని ఎదులాబాద్ డీఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్-2024 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. బాలబాలికల ఆత్మరక్షణ కోసం తైక్వాండో ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్రం నుంచి 376 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఆయన ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడల కార్యనిర్వాహక కార్యదర్శి మాస్టర్ హనుమంత్, మాస్టర్ జయంత్‌రెడ్డి, ఎదులాబాద్ కోచ్ గ్యార నాగరాజు, అర్జున్, పి.నాగరాజు, అబ్దుల్లా, నాయకులు బొట్టు లింగం, క్రీడాకారులు పాల్గొన్నారు.

భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఏఐ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25: రాబోవు కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హవా కొనసాగుతుందని అనురాగ్ యూనివర్సిటీ ఏఐ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఏఐ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం 'రియాలిటీ రీమేజినేటెడ్ వర్క్‌షాప్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లు, జాతీయస్థాయి సదస్సుల్లో పాల్గొని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాబోవు కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని గుర్తుచేశారు. నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐ డీన్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

28న కీసర జోనల్ స్థాయి క్రికెట్ సెలక్షన్స్

కీసర రూరల్, ఆగస్టు 25: ఈనెల 28న దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని స్వామినారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో కీసర, కాప్రా మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు(బాలురు) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో కీసర జోనల్ స్థాయి క్రికెట్ క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ప్రభాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 14, 17 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు తీసుకువచ్చి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ పోటీల్లో ఎంపికైన వారికి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9948263609లో సంప్రదించాలని సూచించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొడంగల్/కొడంగల్ రూరల్, ఆగస్టు 25: శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆప్తాలమిక్ వైద్యులు రషీద్, అమిత్‌లు తెలిపారు. స్థానిక అక్షర హైస్కూల్ ఆవరణలో శ్రీసత్యసాయి భజన మండలి కొడంగల్, శంకర కంటి ఆస్పత్రి హైద్రాబాద్ వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 85మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 25 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కంటిలో శుక్లాలు ఉన్నవారిని ఆపరేషన్ల నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కంటి వైద్య శిబిరంలో సత్యసాయి భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

ఛత్రపతి శివాజీ ఆదర్శనీయుడు

మోమిన్‌పేట్, ఆగస్టు 25: ఛత్రపతి శివాజీ మహారాజ్ అందరికీ ఆదర్శమని, ఆయన చివరి రక్తం బొట్టు వరకూ హిందూ సమాజం కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి అని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మోమిన్‌పేట్ మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ తన చివరి రక్తం బొట్టు వరకూ హిందూ సామ్రాజ్యం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ప్రతీ ఒక్కరూ శివాజీని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కో ఆర్డినేటర్ వడ్ల నందు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆశిరెడ్డి, భుజంగరెడ్డి, విగ్రహం, స్థల దాత రామచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్, సంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు, పలు గ్రామాల హిందూ సంఘాల సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహారాజ్‌పై చర్యలు తీసుకోవాలి



ఏఎస్సై బాల్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 25: మహ్మద్ ప్రవక్త, ఆయన కుటుంబంపై మహారాష్ట్రలోని నాసిక్ రామగిరి మహారాజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామగిరి మహారాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సై బాల్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ గౌడ్‌లకు ఫిర్యాదు చేశారు. మహ్మద్ ప్రవక్తపై ఎవరు అనుచిత వ్యాఖ్యలు చేసినా సహించబోమని ముస్లిం జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఎవరి మతాలను వారు గౌరవించుకోవాలే తప్ప.. మనసులను గాయపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. విద్వేషాలకు కారణమయ్యే వారిని ప్రభుత్వాలు ఉపేక్షించవద్దని కోరారు. రామగిరి మహారాజ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు అబ్దుల్ హఫీజ్, అబ్దుల్ ఖలీమ్, బాబా, హనీఫ్, ఫరీద్, ఫిరోజ్, అలీమ్, షాహెద్, మేరాజ్, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు.. జర భద్రం



తహసీల్దార్ కార్యాలయం వద్ద పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూర్, ఆగస్టు 25: తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదానికి నిలయంగా మారింది. కార్యాలయం వెనుకాల, రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చిన్నపిల్లల చేతికి అందే అంత ఎత్తులో ఉండడం ప్రమాదాన్ని తలపిస్తోంది. కంచె లేకపోవడంతో పాటు, చుట్టుముట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా ఉంది. తహసీల్దార్ కార్యాలయంతో పాటు, ఎంపీడీవో కార్యాలయం, నివాసాల సముదాయం ఈ ప్రాంతంలో ఉండడంతో వాహనాల రాకపోకలతో పాటు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో వచ్చి వెళ్తుంటారు. రోడ్డు కార్నర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ప్రజలు బిక్కు బిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలోని కాలనీవాసులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనుంచి వెళ్లాలంటే తీవ్ర భయాందోళనకు గురవుతుంటారు. ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది సైతం బిక్కు బిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేసి, పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

బాబు బిందేశ్వరి ప్రసాద్ సేవలు చిరస్మరణీయం



బాబు బిందేశ్వరి ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్, ఆగస్టు 25 : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బీసీ నాయకుడు బాబు బిందేశ్వరి ప్రసాద్ సేవలు చిరస్మరణీయమని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పూలే చౌరస్తా వద్ద బాబు బిందేశ్వరి ప్రసాద్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహార్ 7వ ముఖ్యమంత్రిగా పనిచేసి, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి బిందేశ్వరి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు, బీజేపీ మండలాధ్యక్షుడు కిరణ్, కురుమ సంఘం మండలాధ్యక్షుడు పాండు, కోశాధికారి జంగయ్య, నాయకులు శ్రీపతి, ఒగ్గు మల్లయ్య, విఠలయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక కాదు.. పంచాయతీ భవనం



ఎరాన్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న పంచాయతీ భవనంలో పశువులను కట్టేసిన దృశ్యం

కొడంగల్ రూరల్, ఆగస్టు 25 : పై చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం చూస్తే పాకలో పశువులను కట్టేసారు అనుకుంటే పొరపాటే. అది అచ్చంగా గ్రామ పంచాయతీ భవనమే. మండల పరిధిలోని ఎరాన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన పంచాయతీ భవన నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. భవనం పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ స్లాబ్ వరకు పూర్తిచేశాడు. బిల్లులు విడుదల కాకపోవడంతో పనులను స్లాబ్ వరకు పూర్తిచేసి వదిలేశాడు. పంచాయతీ భవనం అసంపూర్తిగా ఉండడంతో పక్కనే ఉన్న ఓ కుటుంబం తమ పశువులను ఆ భవనం స్లాబ్ కింద కట్టేశారు.

హెచ్చరిక లేక ప్రాణాలు హరీ



పూడూరులో నీట మునిగి మృతి చెందిన యువకుడి కోసం గాలిస్తున్న స్థానికులు(ఫైల్)

ప్రమాదకరంగా చెరువులు, కుంటలు

ఈతకు వెళ్లి కొందరు.. చేపల వలలు చిక్కుకొని మరికొందరు మృత్యువాత

లోతు ఎక్కువున్న చెరువులు, కుంటల వద్ద కనిపించని హెచ్చరిక బోర్డులు



చేపల వలలో చిక్కుకుని మృతి చెందిన యువకుడు(ఫైల్)

మేడ్చల్ టౌన్, ఆగస్టు 25 : మండలంలోని పలు చెరువులు, కుంటల వద్ద మృత్యువు ద్వారాలు తెరుచుకుంటోంది. వర్షాల కారణంగా చెరువులు, కుంటల్లో భారీగా నీరు చేరటంతో ఈత కొట్టడానికి వెళ్లి కొందరు.. చేపలు పట్టడానికి వెళ్లి మరికొందరు నీట మునిగి మృత్యు ఒడిలోకి జారుకుంటున్నారు. వర్షాకాలం ఆరంభం నుంచి చెరువులు, కుంటల్లో నీటి మునిగి మృతిచెందిన ఘటనలు పెరుగుతూనే ఉన్నాయి. కాగా, తరచూ జరిగే ప్రమాదాలను అరికట్టడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ఇటీవల మండలంలోని పలు గ్రామాలు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల్లో మునిగి 13 మంది మృతి చెందారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు స్థానిక చెరువుల్లో పెద్దఎత్తున నీరు చేరటంతో స్థానికులు చూసేందుకు వెళుతున్నారు. ఈత కొడుతూ కొందరు.. చేపలు పడుతూ మరికొందరు సందడి చేస్తున్నారు. గుండ్లపోచంపల్లి, మేడ్చల్ పెద్ద చెరువు పరిసరాల్లో ఉన్న కాలనీల్లో ఇతర రాష్ట్రాలనుంచి వలస వచ్చిన వారు నివసిస్తున్నారు. వారికి స్థానిక చెరువు లోతు పట్ల అవగాహన లేక అందులో దిగి నీట మునిగి మృతిచెందినట్లు పోలీసులు చెబుతున్నారు. దీనికి తోడు చెరువులు, కుంటల్లో చేపల కోసం మత్స్యకారులు వలలు ఏర్పాటు చేయడంతో చాలా మంది చెరువులో ఈత కొట్టడానికి వెళ్లి వలలో చిక్కి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలూ ఉన్నాయి. పూడూరు గ్రామ పెద్ద చెరువులో నీట మునిగి మృతిచెందని సంతోష్, మురళీగౌడ్ అనే ఇద్దరు యువకులు చేపల కోసం ఏర్పాటు చేసిన వలలో చిక్కుకొని మృతిచెందిన ఘటన ఇందుకు నిదర్శనం.

హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో..

చెరువుల వద్ద ప్రమాదాలు జరిగి స్థానికులు మృత్యువాత పడుతున్నా అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవటం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులను చూసేందుకు వచ్చే సందర్శకులకు, బట్టలు ఉతకడానికి, చేపలను వేటాడటానికి, ఈత కొట్టడానికి వచ్చేవారిని అప్రమత్తం చేయటానికి స్థానిక అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవటం కూడా ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. దీనికి తోడు తరచూ ఎక్కువ లోతు ఉన్న చెరువుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవటంతో మృత్యువాత పడుతున్నారు.



మేడ్చల్ పెద్ద చెరువు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రజలు నీట మునిగి చనిపోతున్నారు. ఎక్కువ లోతు ఉన్న చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలి. మున్సిపల్ అధికారులు స్పందించి జాగ్రత్త చర్యలు చేపట్టాలి. స్థానికంగా ఉన్న చెరువుల్లో నీట మునిగి మృతి చెందిన ఘటనలు చాలా ఉన్నాయి.

- భాను చందర్, గండ్లపోచంపల్లి

చెరువుల వద్ద కంచె ఏర్పాటు చేయాలి



తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న చెరువుల పరిసరాల్లో కంచె ఏర్పాటు చేయాలి. మత్స్యకారులు చెరువులో వలలు వదిలితే ప్రజలకు తెలియజేయాలి. ఎవరైనా ఈత కొట్టడానికి వెళితే వల చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చాలా ఉన్నాయి.

- సయ్యద్ లాయక్ అలీ, మేడ్చల్

వైభవంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

పాల్గొన్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, ఆగస్టు 25: మండలంలోని లేమూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, మైసమ్మ దేవాయాల్లో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. శ్రావణమాసంలో అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించడం గ్రామస్తులకు శుభపరిణామమని అన్నారు. గ్రామస్తులంతా కలిసి అమ్మవార్ల ఆలయాలను నిర్మించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు ఒగ్గుకథను వినిపించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్‌లు బి.కొండల్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు ఎలుక మేఘనాథ్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, డిల్లీ గణేష్, గుర్వీ జైపాల్, మహేందర్, నారాయణ, అర్జున్, శ్రీధర్, నవీన్, జంగయ్య, గ్రామస్తులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కనుల పండువగా బోనాలు

శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాలను వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నేదునూరు, కందుకూరు, దెబ్బడగూడ, బాచుపల్లి, జైత్వారం, మన్యగూడ, పులిమామిడి, లేమూరుతో పాటు మండల కేంద్రంలో పోచమ్మ, మైసమ్మ దేవాలయాలను ముస్తాబు చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపు సందర్భంగా రాత్రిపూట ఇబ్బందులు కలగకుండా పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు అదనంగా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కె.రామకృష్ణారెడ్డి, ఏనుగు శ్రావణి, యాలాల శ్రీనివాస్, భైరు సదాలక్ష్మి, ఎస్.శమంతకమణి, వత్తుల అనితాశ్రీనివాస్, పరంజ్యోతి, మాజీ వైఎస్ ఎంపీపీ గంగులు శమంతా ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, సురేష్, రాజమ్మ, యాదయ్య, వివిధ పార్టీల నాయకులు, మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



లేమూరులోని ఆలయం వద్ద పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మాజీ ఎంపీటీసీ చొరవతో రోడ్డుకు మరమ్మతులు



చెన్నారెడ్డి గూడ వద్ద రోడ్డుపై మట్టి పోయిస్తున్న గ్రామస్తులు

చౌదరిగూడ, ఆగస్టు 25: రోడ్డుపై గుంతలతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రోడ్డుకిరువైపులా మట్టి పోయించి గుంతలను పూడ్చి వేయించారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి సొంత డబ్బుతో చెన్నారెడ్డిగూడ నుంచి చింతకుంట తండా వరకు రోడ్డుకిరువైపులా ఉన్న గుంతల్లో మట్టి పోయించారు. ఈ సందర్భంగా వాహనదారులు, డ్రైవర్‌లు శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు వడ్ల శ్రీనివాస్, యాదగిరి, రాజు, శివారెడ్డి, కుమార్, యాదయ్య, నర్సింహులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం



పూజల్లో పాల్గొన్న నాయకులు

కడ్తాల్, ఆగస్టు 25: దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి ఎంతగానో దోహదపడుతాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు హన్మనాయక్, గూడూరు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. దైవ, ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఒత్తిళ్లను అధిగమించి ఆనందమయ జీవితాన్ని పొందుతారని తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలోని ఈదమ్మ, పెద్దమ్మ, బీరప్ప దేవాలయాలను ఆదివారం సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు నాయకులను సత్కరించి అభినందించారు. వారు మాట్లాడుతూ సన్మార్గంతో ముందుకు సాగేవారు దైవానుగ్రహం పొందుతారని, అన్ని సామాజిక వర్గాలకు ప్రభుత్వం తోడ్పాటునందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు యాదయ్య, కృష్ణయ్య, జంగయ్య, రాములు, శేఖర్, యాదయ్య, సత్యనారాయణ,జంగయ్య, బుచ్చయ్య, రమేశ్, శ్రీను, మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, నాయకులు మంగళపల్లి నర్సింహ్మా, చేగూరి వెంకటేశ్, బీచ్యనాయక్, పిప్పళ్ల వెంకటేశ్, మాలే మల్లేశ్ గౌడ్, బాల్‌రాజ్, అశోక్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- నిరుపయోగంగా పాఠశాల గదులు, కమ్యూనిటీ హాళ్లు
- కోట్లాది రూపాయల ప్రజాధనం గంగపాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

యాచారం, ఆగస్టు 25: మండలంలోని మేడిపల్లిలో సుమారు రూ.రెండున్నర కోట్ల నిధులతో నిర్మించిన పలు భవనాలు శిథిలావస్థకు చేరాయి. 2009లో ఆనాటి హోం శాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన బీసీ హాస్టల్ భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని రూ.26.5లక్షల నిధులతో నిర్మించారు. ఇందులో ఓ గదిలో నెలనెల పింఛన్లు ఇవ్వడానికి మాత్రమే వినియోగించుకుంటున్నారు. అది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి.. అందులోకి రావాలంటేనే జనం జంకుతున్నారు. 2001లో ఆనాటి మంత్రి కొండ్రు పుష్పలీల ప్రారంభించిన అంగన్‌వాడీ భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంది. ప్రజలకు అనువైన చోట పాఠశాల తరగతి గదులు నిర్మించకపోవడంతో నేడు అవి దేనికీ పనికి రాకుండా పోయాయి. రూ.50లక్షల నిధులతో నిర్మించిన ఈ పాఠశాల భవనాలు శిథిలమవుతున్నాయి. 2011లో సుమారు రూ.32లక్షల నిధులతో నిర్మించిన పాఠశాల గదులను నిర్మించారు. వీటికి తోడు గ్రామంలో పలు చోట్ల కమ్యూనిటీ భవనాలు నేడు వృథాగా పడి ఉన్నాయి. వృథాగా ఉన్న భవనాలను నిరుపేదలు నివాసముండడానికి ప్రభుత్వం అనుమతించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మేడిపల్లిలో శిథిలావస్థకు చేరిన హాస్టల్ బిల్డింగ్



మేడిపల్లిలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం



వృథాగా ఉన్న పాఠశాల భవనం

కొత్త గదుల నిర్మాణాలు చేపట్టాలి

గ్రామంలో మరో నాలుగు చోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మించిన గదులు నిరుపయోగంగా ఉన్నాయి. పాఠశాల ఆవరణలో 1960లో ఎనిర్మించిన పాఠశాల గదులు శిథిలావస్థకు చేరాయి. కాగా, చౌదర్‌పల్లి గ్రామంలో సొసైటీ భవనం పరిస్థితి కూడా అలాగే ఉంది. దాంట్లో తరచూ పాములు సంచరిస్తుండడంతో బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. వాటికి అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే నందివనపర్తి ఉన్నత పాఠశాల ఆవరణలో 1960లో నిర్మించిన నాలుగు తరగతి గదులు, ధర్మన్న గూడలో మూడు తరగతి గదులు, చింతపట్లలో నాలుగు తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. అధికారులు స్పందించి తక్షణమే శిథిలావస్థకు చేరిన గదులను కూల్చివేసి కొత్త భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

పూడూరు, ఆగస్టు 25: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని చేపట్టి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించింది. అయినప్పటికీ గ్రామాల్లో పారిశుధ్య అస్తవ్యస్తంగా ఉంది. దాంతో స్వచ్ఛత పూర్తిగా లోపించింది. గ్రామాల్లో రోడ్ల పక్కన సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరు, మురుగు రోడ్లపై పారుతోంది. అక్కడి నుంచి దోమలు వ్యాపించి డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు దరిచేరుతున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగియడంతో కార్యదర్శులతో పాటు సర్పంచ్‌ల స్థానాల్లో ప్రత్యేకాధికారులను నియమించినా ఎక్కడా కూడా సమస్య పరిష్కారం కావడం లేదు. పూడూరు మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో రోడ్లపై వర్షం నీరు, మురుగు ఏకమై పూర్తిగా దుర్వాసన వెదజల్లుతోంది. అక్కడి నుంచే చిన్న పిల్లలు, వృద్ధులు ఆ మురుగునీటి నుంచే రాకపోకలు సాగిస్తారు. సంబంధిత అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తిర్మలాపూర్ గ్రామానికి ఎంపీడీవో ప్రత్యేకాధికారిగా ఉన్నారు. మండల ఉన్నతాధికారి ప్రత్యేకాధికారిగా ఉన్న గ్రామమే ఇలా ఉంటే.. మిగతా గ్రామాల పరిస్థితి ఏమిటని, ఎలా ఉంటుందో ఊహించలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

అధికారులకు విన్నవించినా ఫలితం లేదు



పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎలాంటి ఉపయోగం లేదు. వర్షం నీరు, మురుగు డ్రైనేజీ సరిగా లేకపోవడంతో మొత్తం రోడ్లపైనే పారుతున్నాయి. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని పారిశుధ్యం, స్వచ్ఛతపై తగిన చర్యలు తీసుకోవాలి.

- వి.రమేష్, తిర్మలాపూర్



తిర్మలాపూర్ గ్రామంలో నిలిచిన వర్షం నీరు



క్రీడాకారులతో పరిగి మునిసిపల్ చైర్మన్ అశోక్

క్రీడాకారులకు మంచి భవిష్యత్

పరిగి, ఆగస్టు 25: క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. పరిగిలోని మినీ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రీడల పట్ల స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. విద్యతోపాటు, క్రీడలకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి హన్మంత్‌రావు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఎస్.భాస్కర్, నాయకులు, క్రీడాకారులు ఆసిఫ్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, రఘు, క్రాంతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేవు.. విధుల్లేవు

● పంచాయతీల్లో పడకేసిన ప్రత్యేక పాలన ● సమస్యలతో కొట్టుమిట్టడుతున్నా పల్లె ప్రజలు



మాసన్‌పల్లి గ్రామంలో ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు

బషీరాబాద్, ఆగస్టు 25: సర్పంచులు, పాలకవర్గాలు లేకపోవడంతో గ్రామాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ప్రధానరోడ్లతో పాటు పలు వార్డుల్లో అంతర్గత రోడ్లు మురికి కూపలుగా మారాయి. డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లలో కార్యకలాపాలు నిర్వహించడంలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి సర్పంచుల పదవీ కాలం పూర్తయింది. బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు చాలా చోట్ల పల్లెల వైపు రావడంలేదు. ఫలితంగా రోజువారీ కార్యక్రమాలు గాడి తప్పుతున్నాయి. కనీస అవసరాలైన తాగునీరు, వీధిదీపాలు, మురుగుకాల్వల నిర్వహణతో పాటు డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణను గాలికొదిలేశారు. మురుగుకాల్వలు, అంతర్గత రోడ్లు అపరిశుభ్రంగా మారి కంపుకొడుతున్నాయి. దీంతో ప్రజలు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, డయేరియా వ్యాధులు సోకి ఆసుపత్రుల వైపు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

బషీరాబాద్ మండలంలో 36 గ్రామ పంచాయతీలుండగా, 8 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు ప్రతేకాధికారులను నియమించారు. ఎంపీడీవో, తహసీల్దార్ తమ పరిధి గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నా మిగతా ప్రత్యేకాధికారులు గ్రామాలను సందర్శించడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన గ్రామ కార్యదర్శులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విధులకు సక్రమంగా రావడంలేదనే విమర్శలు ఉన్నాయి. పంచాయతీలకు వచ్చిన ప్రజాస మస్యలపై స్పందించకుండా నిధులు లేవని మేం ఏం చేస్తామంటూ నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



తహసీల్దార్‌కు సమస్యలపై మొరపెట్టుకుంటున్న ప్రజలు(ఫైల్)



కాశింపూర్‌లో రోడ్డుపై కట్టేసిన పశువులను ఎంపీడీవోకు చూపిస్తున్న స్థానికులు(ఫైల్)

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పిచ్చిమొక్కలు ఎక్కడబడితే అక్కడ పెరిగి చిట్టడవులను తలపిస్తూ పాములు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. నిత్యం పారిశుధ్య కార్మికులు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూడాల్సి ఉండగా ఇదంతా సక్రమంగా జరుగడంలేదని వారంటున్నారు. ఊరికో డంపింగ్ యార్డులు నిర్మించి వ్యర్థాలను రిక్షాలు, ట్రాక్టర్లలో తీసుకెళ్లాల్సి ఉండగా నిధుల లేమితో ఎవరూ అంతగా పట్టించుకోవడంలేదు. ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారి చెత్త తరలింపునకు వాహనాలను సక్రమంగా వినియోగించడంలేదు. పలు పంచాయతీల్లో డైరెక్టు పంపింగ్ బోర్లు, చేతిపంపులు మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారాయి. ఈ విషయమై స్థానిక ప్రజలు ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉండగా పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయి ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తాయి. కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడంతో విధులకు హాజరుకావడంలేదని కార్యదర్శులు పలువురు చెబుతున్నారు.

ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించాలి

ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో పర్యటించాల్సిందే. గ్రామ కార్యదర్శులతో గ్రామ సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నా. కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి. మండల వ్యాప్తంగా పంచాయతీ పాలన సక్రమంగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకుంటా. - గాలి యాదయ్య, ఎంపీడీవో, బషీరాబాద్

క్రైం కార్నర్

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం



సాయికుమార్ మృతదేహం

కీసర రూరల్, ఆగస్టు 25: మూడు రోజుల కిందట అదృశ్యమైన యువకుడి మృతదేహం ఆదివారం ఓ వ్యవసాయ బావిలో లభ్యమైంది. ఈ ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధి బోగారం గ్రామ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా, అనంతారం గ్రామానికి చెందిన మచ్చ సాయికుమార్(27) కీసర మండల కేంద్రంలోని జయభేరి మారుతిసుజుకి షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల నుంచి అతడు కనిపించడంలేదు. దీంతో అతడి తల్లిదండ్రులు కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు సాయికుమార్ ఆచూకీ కోసం వెతుకుతున్నారు. కాగా ఆదివారం ఉదయం పాడుబడిన వ్యవసాయ బావి నీటిలో మృతదేహం తేలిందని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతుడు మచ్చ సాయికుమార్‌గా నిర్ధారించుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ మృతికి గల కారణాలు తెలియరాలేదు. అతడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతానికి పాడిగేదె మృత్యువాత



మృత్యువాతపడిన గేదె

మేడ్చల్ టౌన్, ఆగస్టు 25: మేడ్చల్ పట్టణంలోని కిష్టాపూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాతపడింది. స్థానికులు తెలిపిన వవరాల ప్రకారం.. కిష్టాపూర్ గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డికి చెందిన పాడిగేదెను తన వ్యవసాయ పొలంవద్ద ఆదివారం మేత మేపడానికి తోలుకెళ్లాడు. ఈ క్రమంలో పొలంవద్ద విద్యుత్ స్తంభానికి అమర్చిన ఎర్తింగ్ వైరు తగిలి గేదె అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఈ గేదె విలువ రూ.80వేల వరకు ఉంటుందని బాధితుడు నాగిరెడ్డి తెలిపారు.

అకారణంగా దాడిచేసిన ముగ్గురిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 25: అకారణంగా ఓ యువకుడిపై దాడిచేసిన ముగ్గురిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన బొక్క సూర్యప్రకాష్‌రెడ్డి శనివారం రాత్రి 10గంటలకు ఘట్‌కేసర్‌లోని ఆదర్శ్‌బార్‌లో బీరు కొనుగోలుచేసి పక్కనే ఉన్న పార్కింగ్ వద్ద సిగిరేట్, బీరు తాగుతున్నాడు. అంతలోనే ఓ ఎరుపు రంగు కారు డ్రైవర్ అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ అక్కడ సూర్యప్రకాష్‌రెడ్డి పక్కన నిలిపాడు. కారులో నుంచి డ్రైవర్‌తో పాటు రాజశేఖర్, వేముల వినోద్ అకారణంగా అతడిపై దాడి చేశారు. ఈ దాడిలో సూర్యప్రకాష్‌రెడ్డికి ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. తనపై అకారణంగా దాడిచేసి ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేద విద్యార్థులకు తోడ్పాటునందిస్తాం



దేవరఫస్లాబాద్‌లో విద్యార్థులతో రౌండ్ టేబుల్ ఇండియా ట్రస్టు ప్రతినిధులు

దౌల్తాబాద్, ఆగస్టు 25: పేద విద్యార్థులకు తోడ్పాటునందిస్తామని రౌండ్ టేబుల్ ఇండియా ట్రస్టు చైర్మన్ విషాన్‌గుప్త అన్నారు. మండలంలోని దేవరఫస్లాబాద్ గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.40లక్షలతో పాఠశాల భవనంతో పాటు బాలికలు, బాలురకు ప్రత్యేకంగా మూత్రశాలలను నిర్మించారు. అదేవిధంగా 24 బెంచీలు, ఫర్నీచర్, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్‌లతో పాటు తరగతి గదుల్లో రంగురంగుల బొమ్మలతో పెయింటింగ్ వేయించారు. ఆదివారం పాఠశాలకు విచ్చేసిన సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు దేశంలో తమ సంస్థ ఆధ్వర్యంలో 8వేల పాఠశాలలను నిర్మించినట్లు చెప్పారు. ప్రతీ ఏడాది 300 పాఠశాలలను నిర్మించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుస్మిత, ఆదర్శ్ కుమార్, శ్రావణ్‌కుమార్, రాహుల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వెంకట్రావ్, రాములు, వెంకట్రామ్ రెడ్డి, గోపాల్, వెంకట్రాములు, రాజు, సోమయ్య, నారాయణ, శివశంకర్ పాల్గొన్నారు.

మద్యం ప్రియులకు అడ్డాగా పాఠశాల భవనం



కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పడేసిన మద్యం సీసాలు

కులకచర్ల, ఆగస్టు 25: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పాత భవనం మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. సరస్వతి నిలయాన్ని పర్మిట్ రూమ్‌గా మార్చారు. పాఠశాలకు సమీపంలో బెల్టు షాపులు దర్జాగా కొనసాగుతున్నాయి. ప్రతీ రోజు రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు మద్యం తీసుకొచ్చి పాఠశాల పాత భవనం ఆవరణలో సేవిస్తున్నారు. మద్యం ఖాళీ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు, గ్లాసులు అక్కడే వదిలేసి వెళ్తున్నారు. ఉదయం వచ్చి గమనించిన ఉపాధ్యాయులు విద్యార్థులతో వాటిని తొలగించడం నిత్యకృత్యమైంది. పాఠశాల పాత భవనం ఆవరణలో మద్యం సేవించే వారిని గ్రామస్తులు నియంత్రించేందుకు సాహసించడం లేదు. పాఠశాల ఆవరణలో మద్యం సేవించరాదని చెబితే దాడికి పాల్పడుతున్నారని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మర్పడగ క్షేత్రంలో జిల్లా సబ్‌జడ్జి పూజలు



మర్పడగ క్షేత్రంలో పూజలు చేస్తున్న సబ్ జడ్జి

కొండపాక, ఆగస్టు 25: కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సబ్ జడ్జి అర్జున్ కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతాన మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకంలో స్వయంగా పాల్గొని విజయదుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ సబ్ జడ్జిని శేష వస్త్రాలతో సత్కరించారు.

రామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన

వికారాబాద్: శ్రావణమాసం పురస్కరించుకొని వికారాబాద్ పట్టణ పరిధిలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి పువ్వులతో అలంకరించారు. ఆలయ ధర్మకర్త ఆత్మలింగం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వికారాబాద్: స్వామివారికి హారతి ఇస్తున్న ఆలయధర్మకర్త ఆత్మలింగం దంపతులు

ధారూరులో విద్యుత్ లైన్ల మరమ్మతు



విద్యుత్ లైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ధారూరు, ఆగస్టు 25: ధారూరులో విద్యుత్ సమస్య తలెత్తకుండా ట్రాన్స్‌కో అధికారులు ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నెల 20న వికారాబాద్ డివిజన్ ట్రాన్స్‌కో ఏడీ సత్యనారాయణరెడ్డి మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి స్థానిక కాంగ్రెస్ నాయకులు, వినియోగదారులతో సమవేశమై గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై చర్చించారు. గ్రామానికి 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన మరమ్మతు పనులు చేపట్టుతామని డీఈ వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు అంబేద్కర్ చౌరస్తా నుంచి గ్రామంలోకి ఉన్న 11 కేవీ ఫీడర్‌లైన్‌లో ఏఈ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేశారు. విద్యుత్ లైన్ మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలను నరికివేయించి విద్యుత్ తీగలను బిగించారు. గ్రామంలోని పాతకాలం నాటి విద్యుత్ స్తంభాలను, విద్యుత్ తీగలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తామని అధికారులు వివరించారువిద్యుత్ మరమ్మతు పనులు పూర్తయితే తమ ఇబ్బందులు తొలగుతాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

నీరు ఇంకేదెలా?



హుసేన్‌పూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న ఇంకుడు గుంత

కొడంగల్ రూరల్, ఆగష్టు 25: మండలంలోని హుసేన్‌పూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న ఇంకుడు గుంత వృథాగా మారింది. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో వర్షపు నీరు వృథాకాకుండా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టింది. పాఠశాలలు, చేతిపంపుల వద్ద వీటిని నిర్మించి భూగర్భజలాలు పెంచేందుకు తగు చర్యలు తీసుకుంటోంది. వర్షాలు పడినప్పుడు పాఠశాల పై కప్పునుంచి వచ్చే నీటిని ఇంకుడు గుంతలోకి వెళ్లే విధంగా చేయాలి. అయితే చాల గ్రామాల్లో ఇంకుడు గుంతలు మొక్కుబడిగా నిర్మించి వదిలివేశారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఇంకుడు గుంతల్లో నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు జననం



రెండు దూడలకు జన్మనిచ్చిన గేదెతో కుటుంబం

బషీరాబాద్, ఆగస్టు 25: మండలంలోని ఎక్మాయి గ్రామంలో ఆదివారం ఓ గేదె ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒక దూడ గంటల వ్యవధిలో చనిపోగా, మరో దూడ క్షేమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తాండ్రా పుల్లప్పకు చెందిన ఓ గేదెకు కృతిమ గర్భధారణ చేయగా, రెండు దూడలకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో గేదె ఒక దూడను ఇబ్బంది పడుతూ ప్రసవిస్తుండగా స్థానిక గోపాలమిత్రను పిలిపించారు. రెండు దూడలు పుట్టినప్పటికీ ఒక దూడ కొంతసేపటికే మృత్యువాతపడింది. మరొకటి క్షేమంగా ఉందని గోపాలమిత్ర బసప్ప తెలిపారు. ఒక గేదెకు రెండు దూడలు జన్మించడం నూటిలో ఒకటి ఇలా జరుగుతుందన్నారు.

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఉస్మాన్ అలీకి డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న ఉస్మాన్ అలీ

పరిగి, ఆగస్టు 25: మండలంలోని మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఉస్మాన్ అలీకి డాక్టర్ లభించింది. ఉస్మాన్‌అలీ మాతృభాష ఉర్దు అయినప్పటికీ తెలుగు భాషపై మంచి పట్టుంది. విద్యార్థుల కోసం తెలుగులో చిన్నారిబడి పుస్తకాన్ని రచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరివిల్లు జైహూర్ లెర్నింగ్ పుసకరచనల్లో నిపుణుడిగా అనేక కథలు రాశారు. సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా ముద్రించిన ఆత్మగౌరవ ప్రతీక పుస్తకంలో జాతర ప్రత్యేకతను చాటుతూ గేయాలు రచించారు. తెలుగుబాష, రచనలను గుర్తించి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం నేషనల్ అవార్డు-2024 ఎంపికయ్యారు. ఈ డాక్టరేట్‌ను బహుజన సాహిత్య అకాడమి నేషనల్ ప్రెసిడెంట్ నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



కార్యదర్శి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

కులకచర్ల, ఆగస్టు 25: మండల పరిధిలోని తిర్మాలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఆదివారం గ్రామ పంచాయతీలో పలువురు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మా గ్రామానికి బీటీ రోడ్డును వేయండి



గుంతల మయంగా మారిన బుల్కాపూర్ రోడ్డు

కొడంగల్ రూరల్, ఆగస్టు 25: మండలంలో మారుమూల తాండాలకు సైతం తారురోడ్డు సౌకర్యం ఏర్పాటైనా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ గ్రామానికి మట్టిరోడ్డే దిక్కైంది. ఈ రోడ్డు మార్గం గుంతలమయమై చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా బీపీ మండల్ 106వ జయంతి



బీపీ మండల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

కొడంగల్, ఆగస్టు 25: బిందేశ్వరి ప్రసాద్ మండల్ 106వ జయంతి వేడుకలను ఆదివారం కొడంగల్ పట్టణంలోని వీబీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీపీ మండల్ సేవలను బీసీ సంఘం తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్, న్యాయవాది వెంకటయ్య కొనియాడారు. బీపీ మండల్ కమిషన్ సూచించిన అన్ని సిఫార్సులను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఓం ప్రకాశ్, చంద్రశేఖర్‌గౌడ్, పకీరయ్య గౌడ్, నర్సయ్యగౌడ్, నర్సింహులు యాదవ్, శ్రీకాంత్ గౌడ్, రాములు పాల్గొన్నారు.

మహా వినాయక ఉత్సవ కమిటీ ఎన్నిక



మహా వినాయక నూతన కమిటీని ఎన్నుకుంటున్న హస్నాబాద్ గ్రామస్థులు

కొడంగల్ రూరల్, ఆగస్టు 25: దుద్యాల మండలంలోని హస్నాబాద్‌లో శ్రీమహా వినాయక ఉత్సవ కమిటీని ఆదివారం గ్రామస్థులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ బి.పకీరప్ప, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి, అధ్యక్షులుగా జి.నర్సన్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా పి.ప్రకాష్, రాములు, కార్యదర్శిగా నర్సోజీ, ఉపకార్యదర్శిగా కె.భీములు, కోశాధికారిగా కె.నర్సన్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా నాయికోటి నర్సింహులు, సాంస్కృతిక కార్యదర్శులుగా కొడంగంటి నరేష్, కె.మహేష్ గౌడ్, డెకోరేషన్ కమిటీ సభ్యులుగా నాయికోటి గోవిందు, కృష్ణ, గోపాల్, అశోక్, ఆటో జానీ, భాస్కర్ గౌడ్, సి.రవి, సి.భీములును ఎన్నుకున్నారు.

గమ్యం చేరేదెలా?



చిట్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న సూచిక బోర్డు

కొడంగల్ రూరల్, ఆగస్టు 25: ప్రయాణీలకు సూచికబోర్డులు మార్గనిర్దేశం చేస్తాయి. కొత్తగా ఆ మార్గం గుండా వచ్చే వారు తమ గమ్యం చేరడానికి సూచిక బోర్డులు దోహదపడతాయి. అలాంటి బోర్డుపై గ్రామం పేరు, ఆమార్గం గుండా వేళితే ముందు వచ్చే గ్రామం ఎన్ని కిలోమీటర్ల దూరం సూచించే సమాచారం ఉండాలి. కానీ చిట్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న సూచిక బోర్డుపై ఖాళీగా ఉంది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేంటనే సూచిక బోర్డుపై గ్రామం పేరు, దూరాన్ని తెలిపేలా రాయించాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యేను కలిసిన దామర్‌చెడ్ కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్, ఆగస్టు 25: మండలంలోని దామర్‌చెడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో గ్రామంలో పలు వార్డుల్లో సైడ్ డ్రైన్లు, సీసీ రోడ్లు, బషీరాబాద్ నుంచి దామర్‌చెడ్ వరకు బీటీరోడ్డు మరమ్మతు పనులు చేయించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు వారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, ఏఎంసీ మెంబర్ కొవ్వూరు నరేష్, మాజీ వార్డు మెంబర్ సురేష్, నాయకులు కొనింటి జగదీష్, బాబు, సాయిలు ఉన్నారు.

పంచాయతీ ట్రాక్టర్‌కు మరమ్మతు

బొంరాస్‌పేట్, ఆగస్టు 25: మండలంలోని మేడిచెట్టు తండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ గత ఆరు నెలలుగా పని చేయకపోవడంతో ఆదివారం తండా యువ నాయకులు వినోద్‌నాయక్, రాజునాయక్ సొంత నిధులతో మరమ్మతు చేయించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్, తుల్లనాయక్, గమ్యానాయక్, నౌషి నాయక్, భాస్కర్ నాయక్, గోపాల్‌నాయక్, రమేశ్‌నాయక్, గోపాల్‌నాయక్, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

కల్తీకల్లు బాధితురాలికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు డబ్బులు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ అనుచరుడు

వికారాబాద్, ఆగస్టు 25: మండలంలోని పీరంపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ కల్తీకల్లు తాగి అనారోగ్యం గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటమ్మ త్వరగా కోలుకోవాలని మెరుగైన వైద్యం కోసం రూ.20వేలు తన అనుచరుల ద్వారా ఆస్పత్రికి పంపించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న యజమాన్యం

మూడుచింతలపల్లి, ఆగస్టు 25: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని ఔరాల్యాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ డాక్టర్ ఏవి రామారావు అన్నారు. మండలంలోని కేశవపూర్ గ్రామంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, జామెంట్రీ బాక్స్‌లు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎస్ఆర్ ఫండ్స్ కింద నాలుగు సంవత్సరాల నుంచి కేశవపూర్‌లోని విద్యార్థులకు చదువుకోవడానికి కావాల్సిన వస్తువులను అందజేస్తున్నామన్నారు. పిల్లలకు విద్యార్థి దశలోనే చదువుకోవడానికి సహకారం అందిస్తే దేశసేవలో భాగం పంచుకోవడమని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్, హెచ్ఎం, గ్రామస్తులు, కంపెనీ యజమాన్యం పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ కన్నుమూత



అనంతమ్మ (ఫైల్)

దోమ, ఆగస్టు 25:మండలంలోని దాదాపూర్ మాజీ సర్పంచ్ అనంతమ్మ (80) కన్నుమూశారు. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

IN THE COURT OF THE HONBLE JUDGE, FAMILY COURT CUM II ADDL. DISTRICT JUDGE:: AT MEDCHAL MALAJIGIRI

F.C.O.P No, 151 OF 2023

BETWEEN:

Chandrakanti @ Gumampu Neeraja ...Petitioner

AND

Chandrakanti Srinivas ...Respondent

To,

Chandrakanti Srinivas, S/o Venkataiah, Age: 37 yrs, Occ: Pvt. Employee, R/o H.No. 9-53, Bhagath singh Colony., Chevella, Ranga Reddy District, Telangana

WHEREAS the above named petitioner have filed the above Divorce O.P against you under sec. 13 (1) (i-a)(i-b) of Hindu Marriage Act. Notices were sent to you but you have avoided receiving the same. The case is posted to 14-09-2024, at 10.30 AM for your APPEARANCE. Therefore, you are hereby directed to appear before the above said court on the said date and time in person or through a pleader.

In default of your appearance the matter will be heard and determined in your absence.

"By order of the Court"

Sd/- KODATI MAHESH

ADVOCATES AND SOLICITORS

H.No. 3-262, Indiranagar, .

Vill & Mdl: KOTHAPALLY (H),

Dist: Karimnagar(T.S.). Cell: 9652541665.

GMail: mahikodati@gmail.comn